

నరసరావుపేట: పత్తి చేలో నిలిచిన వర్షం నీరు



మాచవరంలో చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు




నరసరావుపేట వలప్ప చెరువు అలుగు నుంచి ప్రవహిస్తున్న నీరు



బాపట్ల : కొత్తనందాయపాలెం వద్ద మిరపతోటలో నిలిచిన వర్షపునీరు



గుంటూరు ఏటీ అగ్రహారం 16వ లైనులో వర్షపు నీరు



వేమూరు: వర్షపు గాలులకు పడిపోయిన వరి పైరు

రైతుల ఆశలపై.. కుండపోత

అల్పపీడన ద్రోణి ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతు న్నాయి. వర్షాలు పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. కోతకు వచ్చిన వరి పంటపై వానలు విరుచుకుపడడం దిగు బడులపై ప్రభావం చూపుతుం దని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలకు వానలు ప్రతికూలంగా మారనున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై.. రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డెల్టా ప్రాంతమైన లంక గ్రామాల్లో వర్ష ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కలెక్టర్లు అధికా రులతో సమీక్షలు నిర్వహించి ముందస్తు రక్షణ చర్యల పై చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయానికి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి.. హెల్ప్‌లైన్ నం బర్లను అందు బాటులో ఉంచారు. వాతా వరణ శాఖ మరో రెండు రోజులు తుపాను హెచ్చరికల నేపథ్యం లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

పల్నాడు జిల్లాలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు. ప్రజల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామ న్నారు. 08647 252999 నంబరుకు కాల్ చేసి వర్షాల వల్ల ఏర్పడిన సమస్యలు తెలియ చేయవచ్చన్నారు. వర్షంలో వి ద్యుత్ స్తంభాలను తాకరాదని, అత్యవసర పరిస్థితుల్లో ప్ర జలు కంటోల్ రూంకు కాల్ చేవచ్చని కలెక్టర్ తెలిపారు.

రేపల్లె: నిజాంపట్నం హార్బర్‌లో రెండో రోజు గురువారం మూడో నంబరు ప్రమాద హెచ్చరిక కొన సాగుతుందని పోర్టు అధికారులు తెలిపారు. స ముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో.. వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారులు తిరుగుప్ర యాణమై హార్బర్‌కు చేరారు. ఈదురు గా లులతో కూడిన భారీవర్షం పడుతుం డటంతో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



- అల్పపీడన ద్రోణితో ఎడతెరిపిలేని వర్షం
- స్తంభించిన జనజీవనం..రోడ్లన్నీ జలమయం
- వరి, పత్తి పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం
- హార్బర్‌లో రెండో రోజూ కొనసాగిన ప్రమాద సూచిక

(నరసరావుపే ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కార ణంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గురువారం కుండపోతగా వర్షాలు కురిశాయి. ఆకాశా నికి చిల్లు పడిందా అన్నట్లు విరామం ఇవ్వకుండా పడుతున్న వర్షంతో.. జనజీవనం స్తంభించిపోయింది. తెల్లవారుజాము నుంచి వర్షం వదలకుండా రాత్రి వరకు పడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వాన కురిసింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరి సాగు చేపట్టిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వర్షా నికి లోతట్టు ప్రాంతాలే కాకుండా, మెరక ప్రాంతాలకూ ముంపు తప్పలేదు. పల్నాడు జిల్లా పరిధిలో కూడా గురువారం ఓ మోస్తరు నుంచి భారీగానే వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. పదిహేను రోజుల్లో కోతకు రాను న్న తరుణంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో వరి నేలవాలింది. నోటి దాకా వచ్చిన పంట నీటిపాల వుతుందనే వేదన రైతుల్లో నెల కొంది. జూన్, జూలైలో మేఘా లు ముఖం చాటేసిన త రుణంలో విపరీతమైన ఎండలు కాశాయి.. దీంతో ఏ పైరును సాగు చేయలేకపో యారు. ఇప్పుడు వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నా యి. వరి, పత్తి చేలల్లో వర్షపు నీరు చేరింది. లేత పత్తిలో (మిగతా 6వ పేజీలో)



మాచర్ల : రెంటాలలో నేలకొరిగిన వరి

ఆలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ కృతికా శుక్లా.. ఎస్పీ కృష్ణారావు



నరసరావుపేట, అక్టో బరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సంద ర్భం గా ప్రముఖ దేవాలయా ల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చాలని దేవదాయ శాఖ అధికారు లను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆలయాల్లో కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రముఖ దేవాల యాలైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి, అమరావతి అమరలింగేశ్వర స్వామి, ద్వైద మల్లేశ్వర స్వామి, చేజర్ల కపోతేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. జిల్లాలోని ఇతర దేవాలయాల్లో కూడా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, మెడికల్ క్యాంపులు, బస్సు సౌకర్యం, నిరంతర విద్యుత్తు, సీసీ కెమెరాలు, టెంట్లు తదితర ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. నదులు వెంట ఉన్న ఆలయాలకు భద్రత పెంచాలని సూచించారు. ఎస్పీ బి. కృష్ణారావు మాట్లాడుతూ వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక క్యూలైన్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో మురళి, అటవీ శాఖ అధికారిని కృష్ణప్రియ, ఆర్డీవోలు, డీఎస్పీలు, ఈవోలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల జమున స్కూల్‌లో వరండాలో విద్యార్థులు

వరండాలో చదువులు

నాడు - నేడు పూర్తయ్యేదెప్పుడో? ● విద్యార్థుల అవస్థలు

పిడుగురాళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాడు -నేడు అసంపూర్తి పనులతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారు. ఎన్నికలకు రెండేళ్ల ముందు వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథ కంలో మౌలిక వసతుల పేరుతో ఉన్న పాఠశాల భవనాలను కూల్చే సింది. అయితే ప్రభుత్వం నిధులను పూర్తిస్థాయిలో పాఠశాల ఖాతాలకు జమ చేయలేదు. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు, మరికొన్నిచోట్ల పాఠశాల కమిటీలు అప్పులు చేసి కొంతవరకు పనులు పూర్తిచేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో జిల్లాలో గత ఏడాదిన్నర పైగా పాఠ శాలల్లో నాడు నేడు ప నులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు గా మారాయి. రెండేళ్ల గా అద్దె పాఠశాలలో జ మున స్కూల్ పాఠ శాల కొనసాగింది. అ యితే అద్దె భారం భరించలేక అరకొరగా నిర్మాణం పూర్తయిన సొంత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ గదులు సరిపోక విద్యార్థులు వరండాలోనే చదువు కొనసాగిస్తున్నారు. ఎస్‌ఆర్‌పేటీ, మిలటరీకాలనీ పాఠశాల లో మరుగుదొడ్ల నిర్మాణం కూడా పూర్తికా లేదు. రాజుపాలెం మండలం నెమలిపురి జడ్పీ హైస్కూల్‌లో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాకయినా అరకొర పనులను పూర్తి అవుతాయనకుంటే నిరాశే మిగిలిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లెనిన్‌నగర్ జడ్పీ పాఠశాల భవనం దుస్థితి

సంక్రాంతికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

● కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే అరవిందబాబు ● కేశానుపల్లిలోని టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ


నరసరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను సంక్రాంతి పండుగ నాటికి లబ్ధిదారులందరికీ అందజే యడం జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. నరసరావుపేట పట్టణ సమీపంలోని కేశానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని టిడ్కో గృహాలను 217 మంది లబ్ధిదారులకు కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అర విందబాబు గురువారం అందజేశారు. ఈ సం దర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లా డుతూ 1,504 టిడ్కో గృహాలు ఉన్నా యని వాటిలో గతంలో 570 మందికి, ప్రస్తుతం 217 మందికి అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన గృహాలను సంక్రాంతి నాటికి లబ్ధిదారు లకు అందజేయడం జరుగుతుందన్నారు. 270 గృహాల పంపిణీకి సంబంధించి కోర్టులో పెం డింగ్‌లో ఉండగా.. కోర్టు తీర్పుకు అనుగుణంగా ఆయా లబ్ధిదారులకు అందజేయడం జరుగు తుందన్నా రు. పంపిణీ పూర్తికాగానే అం గన్‌వాడీ, ప్రాథ మిక పాఠశాల, వైద్యశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పేదలందరికి సొంతింటి కలనెరవేర్చాలన్న లక్ష్యంతో నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు టిడ్కో గృహాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, నిర్మించారని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పేర్కొన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వేల రూ.కోట్లు ఖర్చుపెట్టి కేవలం రంగులు మాత్రమే వేసింద న్నారు. ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పిం చకుండా అర్హులైన లబ్ధిదారుల పేర్లను తొల గించి.. వైసీపీ కార్యకర్తలకు టిడ్కో ఇళ్లను పం పిణీ చేశారని విమర్శించారు. కోర్టు ఆదేశాలు రాగానే మిగిలిన వారందరికి ఇళ్ల పంపిణీ చేయ డం జరుగుతుందన్నారు. గడిచిన 16 నెలలుగా టిడ్కో కాలనీలో సీసీరోడ్లు, సైడు కాల్వల నిర్మా ణం చేపట్టి.. జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి సహకారంతో 33/11 కేవీ విదుత్ సబ్‌స్టేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఎ మ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు లత, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు, టిడ్కో అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సెల్వరాజ్, ఉపా ధ్యక్షుడు సత్యానందబాబు, బీజేపీ కన్వీనర్ రామ కృష్ణ, మెప్మా పీడీ మురళి, కమిషనర్ జస్వంత రావు, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

జడ్పీలో.. జాప్యం

- ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా అలక్ష్యం



- అద్దె బకాయిల వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం
- రూ.25 కోట్లున్నా వర్క్ ఆర్డర్ల కోసం పడిగాపులు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ నుంచి నిధులు వినియోగం వరకు అన్ని అంశాల్లో జాప్యం జరుగుతోంది. జడ్పీలో అత్యవసరంగా ఏ ఫైల్ కదలాలన్నా నెల లు పడుతోంది. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టిం చుకోవడంలేదు. ఇక్కడ ప్రతీ పని ఆలస్యమే అన్న భావన సర్వత్రా వ్యక్త మవుతోంది. ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనలపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన ఉండటంలేదు. ఈ నెల 29న సర్వ సభ్య సమావేశంలో ఆయా అంశాలపై చర్చ జరగనున్న ట్లు తెలుస్తుంది. జడ్పీకి రూ.వేల కోట్లు విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. అవి ఎక్కడికక్కడ అన్యాక్రాంతం అవుతున్నా యంత్రాంగం పట్టించుకో వడం లేదు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు సర్వే నెంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని నామ్ ఎక్స్‌ప్రెస్ వే (టోల్‌గేట్) సంస్థ వాడుకుంటుంది. అందుకు 2013 నుంచి అద్దె చెల్లిస్తుం ది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అద్దె చెల్లింపులు ఆపేసింది. ఇప్పటికీ జడ్పీకి ఆ సంస్థ నుంచి రూ.12.64 లక్షలు అద్దె రావాల్సి ఉంది. వాటిని చెల్లించక పోగా భూమిని జిల్లా పరిషత్ ప్రమేయం లేకుండా సంస్థకు కేటాయిస్తూ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దానిపై ఇటీవల గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభు త్వానికి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై జడ్పీ అధికారులు కనీస దృష్టి సారించినట్లు కూడా కనిపించడంలేదు. ఇదే రీతిలో జడ్పీకి చెందిన భూముల ఆక్రమణలపై జారీ చేసిన నోటీసులు, కేసులు ఏమ య్యాయో ఎవరికీ తెలియదు. ఆస్తుల పరిరక్షణకు జడ్పీ ఛైర్‌పర్సన్ కమిటీ లు ఏర్పాటు చేసినా సదరు సమావేశాలు నిర్వహించడంలో యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలున్నాయి.

నిధులు ఉన్నా.. పనులు సున్నా

ప్రభుత్వం జడ్పీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 కోట్లు కేటా యించింది. అయినా పనులు కేటాయించడం లేదని పలువురు జడ్పీ టీసీలు వాపోతున్నారు. పాలక వర్గం ఆమోదం పొందిన తర్వాత వర్క్ ఆర్డర్లు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పనులకు సంబంధిం చిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. పాలక వర్గం గడువు ముగుస్తున్నా పనులు కేటాయించడంలో అధికారులు ఈ రకంగా ప్రవర్తిస్తే ఎలా అన్నది కొందరు జడ్పీటీసీల వాదన. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలకవర్గం, కొందరు ప్రజాప్రతినిధులకు మధ్య అగాధం ఏర్పడినట్లు తెలుస్తుంది. కేటాయించిన పనులకు సంబంధించి ప్రగతికి సంబంధించి నివేదికలు తెప్పించుకుని చేపట్టాల్సిన సమీక్షలపైనా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

22 ఎకరాల్లో ప్రభుత్వ భవనాలు

- ఎన్‌ఎస్‌పీ కాలనీలో పనులపై సీఆర్‌డీఏ ప్రణాళిక
- స్థలాన్ని పరిశీలించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని 22 ఎకరాల ఎన్‌ఎస్‌పీ స్థలంలో ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేస్తా మని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఆ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గురువారం జీవీ సీఆర్‌డీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ స్థలంలో మున్సిపల్ కాంప్లెక్స్, కూరగాయల మా ర్కెట్‌తో పాటు, ప్రభుత్వ కార్యాలయాలు, స్టేడియం తదితర భవన నిర్మాణాలకు స్థలం కేటాయింపుపై సీఆర్డీఏ ప్రణాళిక రూపొందిస్తుం దన్నారు. ఈ ప్రణాళికపై అధికారులతో జీవీ చర్చలు జరిపారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి నిర్మాణ పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అధికారులతో పాటు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

అధ్యక్షా అసెంబ్లీకి వస్తున్నాము..

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

సత్తెనపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాస రచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూప గలిగితే మీ నియోజక వర్గ ఎమ్మెల్యేగా అ సెంబ్లీలో అడుగు పెట్టే అవకాశం మీ సొంత మవుతుంది. ఐతే ఈ అవ కాశం మాక్ అసెంబ్లీలో మాత్రమే. నవంబరు 26న రాజ్యాంగ దినోత్స వాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి స్టూడెంట్ అసెంబ్లీ నిర్వాహణకు జిల్లాలో విద్యా శాఖ ఏర్పాటు చేసింది. ప్రజా స్వామ్య విలువలు, నాయ కత్వ లక్షణాలు, రాజకీయాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు షెడ్యూల్ రూపొందించారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఇందుకు అర్హులు.

ఎంపికలు ఇలా..

మండల స్థాయిలో ఈ నెల 24, 25 తేదీల్లో పౌరుల హక్కులు, పౌరుల బాధ్యతలపై వ్యాస రచన, మానవ అభివృద్ధికి చట్టాల రూప కల్పనపై వక్తృత్వం, స్వాతంత్ర్య ఉద్యమంపై క్విజ్ పోటీలు నిర్వహించి ముగ్గురిని నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో రాజ్యాంగ రూప కల్పన వెనుక చరిత్రపై వ్యాస రచన, వికసిత్ ఏపీపై వక్తృత్వం, భారత రాజ్యాంగం పై క్విజ్ పోటీలు నిర్వహించి ఒకరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ంపికైన వారిని నవంబరు 24న రిజిస్ట్రేషన్, 25న అసెంబ్లీ నియమావళిపై శిక్షణ, 26న అమరావతిలో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పరోక్ష అభిషేకాలకు 1,100 మంది భక్తుల నగదు చెల్లింపు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలు జరుగుతున్నాయి. ప్రత్యక్షంగా స్వామివారికి అభిషేకాలు చేయించుకోలేని భక్తులు దేవస్థానం అమలు చేస్తున్న పరోక్ష అభిషేక పథకంపై ఆసక్తి చూపారు. ఇప్పటి వరకు 1,100మంది రూ.1,116 లెక్కన చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరి పేరు మీద ప్రతి రోజు ఉదయం స్వామివారికి అభిషేకం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. కార్తీక పౌర్ణమి వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు.

డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బోయపాలెంలోని డైట్ కళాశాలలో అధ్యాపకుల పోస్టులు డిప్యూటేషన్‌పై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సైకాలజీ, సోషియాలజీ, తెలుగు, ఫైన్‌ఆర్ట్స్, సీనియర్ అంగ్ల, గణిత అధ్యాపకుల పోస్టులకు ఈనెల 29లోగా దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం **www.dietboyapalem.com** వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

24, 26 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల వారాంత రద్దీ దృష్ట్యా ఈ నెల 24, 26 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07642 మచిలీపట్నం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 24న ఉదయం 6.50కి బయలుదేరి 9.35కి గుంటూరు, 10.18కి సత్తెనపల్లి, 11.02కి నడికుడి, సాయంత్రం 4.15కి చర్లపల్లి చేరుకొంటుంది. 07641 చర్లపల్లి - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 26న రాత్రి 7.50కి బయలుదేరి 10.34కి నడికుడి, 11.25కి సత్తెనపల్లి, రాత్రి 1.30కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల


దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న తాత్కాలిక రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బి.ఎ., బీకాం(జనరల్ కంప్యూటర్ అప్లికేషన్స్), బి.బి.ఎ, ఎంఎ, బి.ఎల్‌ఐసీ, ఎంఎ ఎకనామిక్స్ బీఎల్‌ఎస్ కోర్సుల పరీక్షలకు సంబంధించి ఫలితాలను తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైనులాబ్దిన్ తెలిపారు. ఒక్కొక్క పేపరు రీ-వాల్యుయేషన్‌కు డిగ్రీ విద్యార్థులు రూ.770, పీజీ, బీఎల్ఐసీ విద్యార్థులు రూ.960 చెల్లించాలన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను వచ్చే నెల 7లోపు విశ్వవిద్యాలయంలోని దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు అందజేయాలన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల నిలిపివేత


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 35,261 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వా యర్‌లో 10.8 అడుగుల నీటిమట్టం కొనసాగు తుండగా దిగువకు 34,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టంగురువారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 7,033, ఎడమ కాలువ ద్వారా 6,556, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,089, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 48,778 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 48,778 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

లక్ష్యానికి చేరువలో జలవిద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల నుంచి బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0737 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను మీటర్ మేర ఎత్తి 12,702, టేల్ రేస్ చానల్ ద్వారా 8,742.. మొత్తంగా 21,404 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు.ఎగువన సాగర్,ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,089 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా.. ఇది 7.080 టీఎంసీలకు సమానం. 2026 మార్చి 31 వరకు 80 ఎంయూల విద్యుదుత్పత్తి లక్ష్యం కాగా ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 55.006 ఎంయూల కరెంట్‌ను తయారు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులను అరెస్టు చూపిస్తున్న అర్బన్ పోలీసులు

పొన్నూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎల్.వీరానాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని వీబీఎన్ కళాశాల డొంక రోడ్లలో గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తున్నారని సమాచారంతో అర్బన్ సీఐ వి.శ్రీహరి, ప్రొబేషనరీ ఎస్ఐ ఎం.నాగార్జున పోలీస్ సిబ్బందితో కలిసి సోదాలో నిర్వహించినట్లు చెప్పారు. పదిమంది యువకులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా.. 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా మర్రి సాయి మణికంఠరెడ్డి అనే నిందితుడు బాపట్ల జిల్లా వెదులపల్లి గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి అనే మహిళ గంజాయి విక్రయించినట్లు తెలిపారు. పరిచయస్తులైన కత్తి యశ్వంత్, పోలవరపు అజయ్, ఏకశిరి సూర్యనారాయణ, కంబాల శ్రీనాథ్ రెడ్డికి చిన్న ప్యాకెట్లుగా విక్రయించినట్లు తెలిపారు. గంజాయి పొందిన సదరు యువకులు.. షేక్ షబీర్, అలూరి వెంకట మణిరత్నం, మోపర్తి దేవదాసు, ప్రసాదం తరుణ్ కుమార్, విన్నకోట భరత్ కల్యాణ్ అనే వారికి ప్యాకెట్ రూ. 500లకు విక్రయించినట్లు విచారణలో తేలిం దన్నారు. పోలవరపు అజయ్, వెదుళ్ళపల్లి ప్రసన్నకుమారి ఇద్దరు గంజాయి విక్రయితలు పరారీలో ఉండగా, బంట్రోతు ప్రశాంత్ అనే గంజాయి సేవిస్తున్న యువకుడు కూడా పరారీలో ఉన్నటట్లు పోలీసులు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అడవిలో తప్పిపోయిన మహిళ గుర్తింపు


క్షేమంగా ఇంటికి చేరిన బాణావత్ బోణీ బాయి

బొల్లాపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాణావత్ బోణీ బాయి మేకలదిన్నె తండాకు కాలి నడకన వెళ్తుండగా.. దారి తప్పింది. అడవిలో ఆమె జాడ తెలియక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సమీర్ బాషా గురువారం ఉదయం సిబ్బందితో డ్రోన్ సాయంతో అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. వేరే తండాకు సమీపంలో చెట్ల కింద బోణీబాయి ఉండటం గుర్తించి.. ఆమెను మేకలదిన్నెతండాలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వలస కూలీల పిల్లలకు సీజనల్ హాస్టల్స్



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు సమీపంలో బిహార్, ఒడిశా, ఉత్త ప్రదేశ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల పిల్లలకు సీజనల్ హాస్టల్స్‌ని నిర్వహించ బోతున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం ఆయన ఈ అంశంపై ఎన్‌జీవోలతో కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వలస కూలీల పిల్లల విద్యాభివృద్ధికి సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన సూచనలు అనుసరించి హాస్టల్స్ నిర్వహణ కోసం ఎన్‌జీవోలను ఎంపిక చేస్తామన్నారు. ఎన్‌జీవోలు హాస్టల్స్ పిల్లల కోసం సెంటర్స్ బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ వారికి విద్యను అందించాలని, అలాగే వాళ్ల ఆహార అలవాట్లు ప్రకారం భోజనం సదుపాయాలు కల్పించాలన్నారు. పిల్లలకు సంబంధించిన భాషలోనే విద్య అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్క ఎన్జీవో వారు కేటాయించిన పరిధిలో పూర్తి పారదర్శకంగా సెంటర్ నిర్వహించాలని ఆదేశించారు. సక్రమంగా నిర్వహించని హాస్టల్స్ ఎన్‌జీవోలపై చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పద్మ పాల్గొన్నారు.

రైతుల ఆశలపై.. కుండపోత

(5వ పేజీ తరువాయి)

వర్షపు నీరు నిలబడడంతో పొలాలు ఉరకెత్తే ప్రమాదం ఉందని, దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాలిపోయిన పైరును నిలబెట్టడానికి రైతులు శ్రమిస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడుతూనే ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని వారు ఆందోళన చెందుతున్నారు.

- పల్నాడు జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై నీరు ప్రవహిస్తోంది. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు పత్తి, మిరప పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. రెడ్డిపాలెం, మాచవరం, పరగటిచర్ల, అన్నవరం, ముత్తనపల్లి తదితర గ్రామాల్లో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మాచవరంలో చప్టాపై నుంచి వర్షపు నీరు ప్రవహించటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, అన్నవరం గ్రామాల్లో వర్షపు నీరు చప్టాలను తాకుతూ ప్రవహిస్తుంది. భారీ వర్షాల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడికక్కడ ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. క్రోసూరు మండలం ఆవులవారిపాలెంలో వైద్యాధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు.

బాపట్ల జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు

- బాపట్ల జిల్లా పరిధిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయమయ్యాయి. పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లడంతో రాకపోక లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేశవరపాడు - తిమ్మర్తిపాడు మధ్య ఆలేరు వాగు, వంకాయలపాడు - పూసపాడు మధ్య కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిమితపాడు పరిధిలోని వరి పొలాలు పూర్తిగా నీటమునిగాయి. కారంచేడులో పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. చీరాల పరిధిలో జాండ్రపేటలోని ఓ కాలనీని వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో అక్కడ నివాసం ఉండే కుటుంబాలను పునరావస కేంద్రాలకు తరలించారు. అద్దంకిలో మొక్కజొన్నపై వర్ష ప్రభావం అధికంగానే ఉండనున్నది. బాపట్లతో పాటు రేపల్లె, వేమూరు పరిధిలో కోతకు సిద్ధమైన వరి పైరు నేలకొరగింది. దీంతో కంకుల్లో తాలు ఎక్కువగా వస్తుందని రైతులు బోరుమంటున్నారు. లంక గ్రామాల్లో మెట్ట భూముల్లో వేసిన మినుము పైరులోనూ వర్షపు నీరు భారీగా నిలిచింది. వర్షం ధాటికి కూరగాయ పంటలు పూత, పిందె రాలిపోయాయి.

4 గంటల్లో.. 27 మిల్లీమీటర్ల వర్షం

వాయుగుండం ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. అన్ని మండలాల్లోనూ గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యన కుంభవృష్టి పడింది. ఉదయం 8.30 గంటల ముందు వరకు 21.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడంతో సాయంత్రం కేవలం 3.4 మిల్లీమీటర్లకు తగ్గింది. దుగ్గిరాల, చేబ్రోలు, కొల్లిపర, గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి మండలాల్లో అంతకంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నుంచే ఆకాశం దట్టమైన కారుమబ్బులు కమ్ముకొని చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఉదయం 8.30 తర్వాత ఒక్కసారిగా భారీగా వర్షించింది. మధ్యాహ్నం వరకు కురుస్తూనే ఉన్నది. ఈ కారణంగా కాకుమానులో 14.6, మేడికొండూరులో 28.2, తుళ్లూరులో 14.2, తాడేపల్లిలో 16.2, తాడికొండలో 18, మంగళగిరిలో 16.4, పెదకాకానిలో 25.6, చేబ్రోలులో 46.4, దుగ్గిరాలలో 69.4, కొల్లిపరలో 41.6, గుంటూరు పశ్చిమలో 40, గుంటూరు తూర్పులో 42.4, పొన్నూరులో 21.4, ఫిరంగిపురంలో 25.6, వట్టిచెరుకూరులో 18.2, ప్రత్తిపాడులో 10.2, తెనాలిలో 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మద్యం కుంభకోణంలో జగన్‌దే కీలకపాత్ర

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం, కల్తీ మద్యం ఘటనల్లో కర్త, కర్మ, క్రియ జగనేనని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం విమర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న మద్యం పాలసీని పక్క రాష్ట్రాలు అధ్యయనం చేస్తుంటే, విషపూరిత మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మించి వందల మందిని పొట్టన పెట్టుకున్న జగన్ దానిని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం గుర్తింపు కోసం ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే తయారీ సంస్థ, తేదీ, సంస్థ లైసెన్స్ సమాచారం కనిపిస్తుందని వివరించారు.

నకిలీ మద్యంపై అసత్య ప్రచారాలు : చీఫ్ విప్ జీవీ

వినుకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డికి ఆదాయం తెచ్చిపెట్టే నకిలీ మద్యం బట్టీలు మూసుకుపోతున్నాయనే భయం పట్టుకుందని, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. నేరం జరిగి నిందితులను పట్టుకుంటే అభినందించాల్సింది పోయి.. వారిని ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నిస్తున్నారని..మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఏరులైపారినా పట్టించుకోలేదు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. అందుకే జగన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. నకిలీ మద్యం వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్న జోగి రమేష్ లాంటి వ్యక్తిని ఇంకా పార్టీలో ఉంచుకొని మీడియా ముందు చిలకపలుకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేతి వాటం

సత్తెనపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం కేంద్రంలో కేటుగాళ్లు చేతి వాటం చూపారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి శివ కోటేశ్వరరావుకు చెందిన ఏటీఎం కార్డును చోరీ చేసి.. పలు దఫాలుగా రూ.2.87 లక్షలు డ్రా చేశారు. కోటేశ్వరరావుకు సమాచారం తెలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏటీఎంలో సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా పలు ఏటీఎంలలో కేటు గాళ్లు తమ చేతి వాటం ప్రదర్శించారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

తాడికొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. తాడికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తండ్రి మరణించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసుకుంటూ.. ఆ బాలిక ఇంటి వద్దే ఉంటోంది. మండలానికి కేంద్రానికి చెందిన ఓ యువకుడితో బాలికకు పరిచయం ఏర్పడింది. అతడు ప్రేమ పేరుతో బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశారు. బాలిక ఐదు నెలల గర్భిణీ అని తెలుసుకున్న బంధువులు ఆ యువకుడిని పెళ్లి చేసుకోవాలని కోరారు. అతను పెళ్లికి నిరాకరించడంతో తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు రావడంతో యువకుడు పరారయ్యాడు. తుళ్లూరు డీఎస్పీ మురళికృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్

● గుంటూరు సర్కిల్ ఎస్ఈ రమేష్

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో గుంటూరు విద్యుత్ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎక్కడైనా 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్‌లు తెగిపడిపోతే.. కంట్రోల్ రూమ్ నంబరు 94408 17526 లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు లేదా శబ్దం వచ్చినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

ఈపూరు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుపల్లి సమీపంలో ఎన్నెస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని గురువారం సాయంత్రం గ్రామస్థులు గుర్తించారు. 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న వ్యక్తి శవంపై ప్యాంటు, షర్టు ఉంది. శరీరం, ముఖం చేపలు తినడం వల్ల గుర్తుపట్టలేని విధంగా మారింది. గిరజనులు పూజించేదేవత పచ్చబొట్టు చేతిపై ఉండడంతో.. వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా బావిస్తున్నారు. వీఆర్వో ఎస్కే అబ్దుల్ నబీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ బస్ డిపోకు చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు అనే డ్రైవర్‌పై గురువారం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. తిరుపతి నుంచి సత్తెనపల్లి వస్తుండగా పట్టణంలోని ఎన్ఆర్టీ సెంటర్లో టీ స్టాల్ వద్ద ఈ ఘటన జరిగింది. డ్రైవర్ శ్రీనివాసరావు టీ తాగుతుండగా మద్యం మత్తులో ఉన్న ఇద్దరు పోట్లాడుకుంటూ అతనికిపైకి దాడికి దిగారు. 108 వాహన సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి.. దాడికి పాల్పడిన వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు.

రెప్పపాటులో రూ.1.30 లక్షల చోరీ

చిలకలూరిపేట, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్లో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న ఒక కిళ్లీ బంకు వద్ద గురువారం రూ. 1.30 లక్షల చోరీ జరిగింది. కిళ్లీ బంకులకు ప్రతి రోజూ ద్విచక్ర వాహనంపై వచ్చి సిగరెట్లు సరఫరా చేసే చుండూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి ఈ నగదు కొట్టేశారు. అతను వాహనం దిగి బంకు వ్యక్తికి సిగరెట్ ప్యాకెట్లు ఇస్తున్న సందర్భంలో బైక్ పై వచ్చిన ఇద్దరు నగదు చోరీ చేశారు. బా ధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా దొంగలను గుర్తించే పనిలో ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

35,492 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 36,297 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,492 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,269 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10000	13500	నెంబరు. 5	10000	14500
341	10000	15700	273	---	----
4884	---	---	341	10000	16000
సూపర్ 10	---	----	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15100	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14600
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సచివాలయాలకు ఉద్యోగులు డుమ్మా

● సమస్యలతో వచ్చిన ప్రజలు వెనక్కి

నకరికల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయంలో విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు గురువారం అధిక శాతం గైర్హాజరయ్యారు. కొన్ని గ్రామ సచివాలయాలైతే తలుపులు కూడా తెరవని పరిస్థితి. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు ఎవ్వరూ లేకపోవటంతో వెనుదిరిగి వెళ్లారు. సాధారణ పని దినాల్లో సైతం 11 గంటల లోపు విధులకు హాజరుకావటం లేదని, నాలుగు గంటలు దాటితే ఎవ్వరూ సచివాలయాల్లో ఉండటం లేదని ఇప్పటికే ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. గురువారం కొన్ని సచివాలయాలు తలుపులు తీయలేదని, ఉద్యోగులు విధులకు హాజరు కాలేదని మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో మండల పరిషత్ అధికారులు ఆరా తీయగా సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరు కాలేదని పరిశీలనలో తేలింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు సమాచారం.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఇంటింటికి తిరిగి అప్రమత్తం చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

క్రోసూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అంటువ్యాధులు ప్రబల కుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ గఫ్రూన్, డాక్టర్ సిరిచందన, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ఆవులవారిపాలెంలో వీధుల్లో తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు మురుగునీరు నిల్వ ఉండ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు గృహాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పారబోయాలని తెలిపారు. దోమతెరలు వాడాలని సూచించారు. జ్వరం, దగ్గు వంటివి వస్తే వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. గ్రామంలో తొట్లలో ఉన్న నీటిని పారబోయించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో పాటు ఎప్పటికప్పుడు ఇంటింటికి తిరుగుతూ ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

ఐలాండ్ సెంటర్‌లో విస్తరణ పనులు వేగవంతం

పిడుగురాళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐలాండ్ సర్కిల్‌లో విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సర్కిల్‌లో ఫౌంటేన్ ఏర్పాటుకు ఆక్రమణలను తొలగించడమే కాకుండా నిర్మాణానికి అవసరమైన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపారు.

దేచవరం, నకరికల్లులో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నకరికల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. దేచవరం మోడల్ స్కూల్‌లో, నకరికల్లు శ్రీవిశ్వశాంతి పబ్లిక్‌స్కూల్‌లో ఈనెల 24, 25 తేదీల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ఆధార్‌సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

మినీ లారీ, ట్రాక్టర్ ఢీ.. ఒకరికి గాయాలు

రెంటచింతల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మినీ లారీ, ట్రాక్టర్ ఢీకొన్న ఘటన రెంటచింతల జాతీయ రహదారి నుంచి మిట్టగుడిపాడు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగింది. లాం రమేష్‌బాబు ఇంటి సామన్లను మినీలారీలో తీసుకెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీలో ఉన్న రమేష్‌బాబు తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

రెంటచింతల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ గోవిందు బాలస్వామి అన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన తానుచింతల శ్యామ్, మామిడి యశ్విన్, పీఈటీ సురేష్‌ను గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, ఎం.రాంబాబు, వి.శ్రీనివాసరావు, శేషసాయి, మర్రెడ్డి, శౌరయ్య, తుపాకుల శ్రీను, జైపాల్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి అధికారులతో సమీక్ష

రెంటచింతల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో చేయాల్సిన, చేస్తున్న ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులతో సమీక్షను రెంటచింతల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు.

అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీ నుంచి టీడీపీలోకి..

నకరికల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆకర్షితులై తాము టీడీపీలో చేరుతున్నట్టు కుంకలగుంటకు చెందిన షేక్ మాబూ సుభానీ, షేక్ జానీబాషా కుటుంబ సభ్యులు తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నట్టు టీడీపీలో చేరిన నేతలు వివరించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కన్నా వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



ఎమ్మెల్యే కన్నా, బాజీచౌదరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

గొయ్యి తీశారు.. వదిలేశారు

దాచేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ ఆర్‌అండ్‌బీ బంగ్లాసెంటర్‌లో టెలికంశాఖకు చెందిన కాంట్రాక్టర్ 20 రోజుల క్రితం రోడ్డు పక్కన సుమారు 10 అడుగుల పొడవు, 10అడుగుల లోతు, 3 అడుగుల వెడల్పు లోతున్న గొయ్యినితీసి మట్టిని రోడ్డుకు ఇరువైపులా కుప్పపోశారు. ఈ గొయ్యితో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. గొయ్యిని పూడ్చకుండా వదిలివేయటంతో గత మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం జారిపడి ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న గొయ్యి, ఇన్‌సెట్‌లో గొయ్యి

పీపీపీపై వైసీపీది తప్పుడు ప్రచారం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం మెడికల్ కళాశాలలపై తెస్తున్న పీపీపీ విధానం గురించి వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ, చేసిన తప్పులనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పీపీపీ విధానంపై వైసీపీ అబద్దాలు చెబుతూ ఆందోళన చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయలేని జగన్ ఇప్పుడు ప్రజలకు ఏదో మంచి చేస్తున్నట్టు మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను పక్కదారి పట్టించేందుకు కోటి సంతకాల సేకరణ అనే నాటకానికి తెర లేపారన్నారు. పీపీపీ విధానంతో ప్రభుత్వ కోటాలో సీట్లు అదనంగా పెరుగుతాయని, దీని ద్వారా రాష్ట్ర విద్యార్థులకు మరింత అవకాశం లభిస్తుందన్నారు. ఈ విధానంలో నిర్మాణాలు త్వరగా పూర్తవుతాయని, కర్ణాటకలో కూడా మెడికల్ కళాశాలలు ఆ విధానంలోనే నిర్మాణమవుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిన వైసీపీ ప్రజల్లో మనుగడ కోసం అబద్ధాలను చెబుతూ కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే ప్రవీణ్ హెచ్చరించారు.

అధిక వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపూడిలో పత్తి పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం జగ్గారావు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి చేలో నీటిని వెంటనే బయటకు పంపాలని రైతులకు సూచించారు. అధికతేమ ఉన్న పత్తిచేలల్లో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించటానికి ఎకరా పత్తిలో ఎనిమిది నుంచి పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పచ్చదోమ, తెల్లదోమ నివారణకు పిచికారి చేయాల్సిన మందులను ఆయన రైతులకు తెలిపారు. పత్తి, మిరప సాగులో రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఆయన వెంట ఏడీఏ రవిబాబు, ఏవో సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

● పెదకూరపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అధికవర్షాల నేపథ్యంలో పంటలు వేసిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు అన్నారు. మండలంలోని చినమక్కెన గ్రామంలో పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంట పూత, కాయలు పెరిగే దశలో ఉందని, పల్లపు పొలాల్లో ఉన్న నీటిని బయటకు వెళ్ళబెట్టి నేల ఆరేటట్టు చేసుకోవాలని సూచించారు. పత్తి పై ఎకరానికి 25 నుంచి 30 కేజీల యూరియా, 10 నుంచి 15 కేజీల పొటాష్ ఎరువులను చల్లాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలతో మందులను పిచికారి చేయాలన్నారు. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవటానికి ఎకరాకు కిలో చొప్పున 19-19-19 యూరియా కలిపి పిచికారి చేయాలని వివరించారు. పంటనమోదుపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 25వ తేదీ లోపు పంట నమోదును పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వ్యవసాయ ఏడీఏ పి.రవిబాబు, మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణయ్య పాల్గొన్నారు.



సత్తెనపల్లి: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

తుఫాన్ ప్రభావంతో రైతులకు ఇబ్బందులు

పిడుగురాళ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుండి తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో పత్తి, వరి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం వుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు గాలులకు జానపాడు, వీరాపురం తదితర గ్రామాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న వరిపంట నేలకొరిగింది. పత్తి, వరి పంటలలో నిల్వవున్న వర్షపునీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపించే ఏర్పాట్లుచేసుకోవాలని వ్యవసాయ అధికారి సంధ్యారాణి రైతులకు సూచించారు. గురజాల నియోజకవర్గంలో రైతులు సాగుచేస్తున్న పంటలు కురుస్తున్న వర్షాలకు ఎటువంటి నష్టం జరుగకుండా రైతులకు తగు సూచనలు, సలహాలు అందించేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంగా వుండటంతోపాటు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పంటలను పరిశీలించాలని ఎమ్మెల్యే యరపతినేని వ్యవసాయ అధికారులతో గురువారం ఫోన్‌లోమాట్లాడి సూచనలు చేశారు.

నేల వాలిన వరి

రెంటచింతల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరి సాగుచేసిన రైతన్నల కంట కన్నీళ్లు వస్తున్నాయి. రెంటాల, మంచికల్లు గ్రామాల్లో సాగవుతున్న వరి ఈని పదిహేను రోజుల్లో కోతకు రానున్న తరుణంలో అల్పపీడన ప్రభావంతో ఈదురు గాలులు వీస్తుండడంతో నేలవాలింది. రెంటచింతల మండలంలో ఈ ఖరీఫ్‌లో 5728 ఎకరాల్లో వరిసాగవుతుంది. లేత పత్తిలో వర్షపునీరు నిలబడడంతో పొలాలు ఉరకెత్తే ప్రమాదం ఉంది.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



ఏరియా వైద్యశాలలోని స్కానింగ్ గదిని తనిఖీ చేసిన డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి

సత్తెనపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గల స్కానింగ్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నిబంధనలు, రికార్డులు పరిశీలించారు. నియమ నిబంధనలు పాటించాలని స్థానిక వైద్యులకు సూచించారు. ఆయనతో పాటు డాక్టర్లు సుజాత, ఆశా పూర్ణిమ, వైద్య సిబ్బంది ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ సందర్శన

కారంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం ప్రిన్సిపాల్ సుహాసినితో కలిసి స్థానిక శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీలోని యంత్ర పరికరాలు గురించి, అవి పనిచేసే విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం సుజాత, ఉపాధ్యాయినులు, శ్రీచక్ర సిమెంట్స్ ఫ్యాక్టరీ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల దందాలతో వ్యాపారులు బెంబేలు

కారంపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాకు చెందిన ముగ్గురు విలేకరులు వ్యాపారస్థులను బెదిరిస్తూ దందాలకు పాల్పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముగ్గురు విలేకరులు చేస్తున్న దందాలతో వ్యాపారులు, అధికారులను సైతం భయపెట్టి అక్రమ సంపాదనకు తెర దీస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్వర్లును బెదిరించి రూ.10లక్షల వరకు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వీరిపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, చప్పిడి రాము, వెంకటేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల - కర్నూల్ బస్సు సర్వీసును నడపాలి

● డయల్ యువర్ డీఎంకు 23 ఫిర్యాదులు

మాచర్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల డిపో నుంచి కర్నూల్‌కు బస్సు సర్వీసును నడపాలని పలువురు ప్రయాణికులు కోరారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు 23 ఫిర్యాదులు అందినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నుంచి శిరిగిరిపాడు వయా దుర్గి మీదుగా నరసరావుపేటకు బస్సు సర్వీసు నడపాలని, కారంపూడి ఎస్సీ కాలనీలో బస్సు సర్వీసులను నిలపాలని, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు కంభంపాడులో రిక్వెస్ట్ బస్టాఫ్ ఏర్పాటు చేయాలని, ఉప్పలపాడు, మరసపెంట గ్రామాలకు రాత్రి వేళ బస్సు సర్వీసును నడిపి అదే బస్సు సర్వీసును ఉదయం మాచర్ల పట్టణంలో ప్యాసింజర్ రైలుకు అటాచ్ చేయాలని తదితర ఫిర్యాదులు అందినట్లు డీఎం తెలిపారు.

పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ ప్రయోజనాలు నెరవేర్చాలి

● పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల, రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ కార్డు వలన ప్రయోజనం ఉండడం లేదని, ప్రస్తుతం వాటి పూర్తి ప్రయోజనం నెరవేరేలా పెన్షనర్లకు ఉచితంగా వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆసుపత్రులు పెద్ద జబ్బులకు సంబంధించి రీయింబర్స్‌మెంట్ తీసుకుంటున్నారని, దీనివల్ల పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం పట్ల తగిన ఉత్తర్వులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తాత్కాలిక అధ్యక్షుడు వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు మర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలీబు, జాయింట్ సెక్రటరీ గౌస్, సుబ్బారావు, కిరీటి, సాధనాల లక్ష్మణరావు, పాణి, నారాయణ, మాబు, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

మాలధారులకు సద్ది ప్రారంభం



రాజుపాలెం: గంగిరెడ్డిపాలెం శివాలయంలో సద్ది చేస్తున్న మాలధారులు

రాజుపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెం శివాలయంలో రాజుపాలెం గ్రామానికి చెందిన గల్లా ప్రసాద్ ఆధ్వర్యంలో మాలధారణ స్వాములకు సద్ది కార్యక్రమం ప్రారంభించారు. రాజుపాలెం, గంగిరెడ్డిపాలెం, బ్రాహ్మణపల్లి, బలిజేపల్లి గ్రామాలలో మండల దీక్ష చేపట్టిన అయ్యప్పలకు, భవానీలకు, ఆంజనేయ మాలధారణ స్వాములకు 41 రోజుల పాటు అన్నదానం చేయనున్నట్లు గల్లా ప్రసాద్ తెలియజేశారు.

● కారంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మూరి సత్యనారాయణచార్యులు, లక్ష్మీపురం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వెంకటరామిరెడ్డి ఆధ్వర్యాన గురువారం అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి మాలధారులకు సద్ది ఏర్పాటు చేశారు. కార్తీక మాసం సందర్భంగా 40 రోజులపాటు సద్ది ఏర్పాటు చేయనున్నారు.

ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ మహ్మద్ పెద్ద ఖాసీం ఎన్నిక

మాచర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాచర్ల తాలూకా ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ మహ్మద్ పెద్ద ఖాసీం ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని ఏపీఎన్జీవో హాలులో ఎన్నికల అధికారి ఎం రామయ్య పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా టీ నాగేశ్వరరావు, కోశాధికారిగా కే సుశీల, సహాధ్యక్షుడిగా ఆర్ శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షులుగా కే కిషోర్, ఎస్‌కే నాగుర్‌బాషా, డీ శేష బ్రహ్మాచారి, వీ మకట్‌లాల్, వుమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలిగా అలివేలు మంగమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామనాయక్, సహాయ కార్యదర్శులుగా పాదం విజయకుమార్, మురళీధర్, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, మహిళా సహాయక కార్యదర్శిగా లిల్లీపుష్ప, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా బాలశౌరి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు సిటీ అధ్యక్షుడు ఎస్‌పీఎస్ సూరి, జిల్లా అడక్ కమిటీ చైర్మన్ ఎం రామకృష్ణ, కన్వీనర్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ వెంకటరమణకు టీడీపీ నేతల సన్మానం

మాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తురకా వెంకటరమణను గురువారం వడ్డెర సంఘం రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యాన టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్‌స్టేషన్లో సీఐ వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్స్‌లో దొంగతనాలను అరికట్టాలి

పట్టణంలోని హౌసింగ్ లేఅవుట్స్‌లో దొంగతనాలను అరికట్టాలని పట్టణ సీఐ తురకా వెంకటరమణను గురువారం హౌసింగ్ ఏఈ మరియదాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కోరారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్లో సీఐ వెంకటరమణను కలిసి హౌసింగ్ లేఅవుట్స్‌లలో జరుగుతున్న దొంగతనాలను వివరించారు. స్పందించిన సీఐ మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్స్‌లలో గస్తీ ఏర్పాటు చేయిస్తామన్నారు. అనంతరం ఏఈ మరియదాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కలిసి సీఐ వెంకటరమణను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆలి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సీఐ వెంకటరమణను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

మాచర్ల పట్టణ సీఐగా వెంకటరమణ

మాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సీఐగా తురకా వెంకటరమణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ సీఐగా ప్రమోషన్ పొందారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ ప్రభాకరరావును ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కఠినంగా వ్యవహరిస్తానన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిలో సత్తెనపల్లి దూసుకుపోతోంది

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



తాలూకా సెంటర్‌లో బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో సత్తెనపల్లి ముందుకు దూసుకుపోతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రెయింబో యాడ్స్ సహకారంతో పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా సెంటర్‌లో దశాబ్దాల తరబడి ప్రయాణీకులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూర్చునే వసతి లేక ఇబ్బందిపడ్డారని, ఈ బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన బస్‌షెల్టర్‌లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు.

నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పట్టణంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలో రూ.రెండు కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుంచేలా సచివాలయ ఉద్యోగులు పని చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరుచేసే విషయంలో పారదర్శకతతో అధికారులు పని చేయాలన్నారు. ఆయా కార్యక్రమాలలో డిపో మేనేజర్ విజయకుమార్, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, రింగిశెట్టి సుమన్, మస్తాన్‌వలి, నూర్‌బాషా జానీబాబు, మక్కపాటి రవిచంద్ర, కే శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు, జానీ ఖాజావలి, ఆకుల హనుమంతరావు, అబ్దుల్లా, అంబిక, కందిమళ్ళ రజిని, సుబ్బారావు, కొండలు, బలిజేపల్లి సురేష్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సభ్యులు లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ముప్పాళ్ళ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సభ్యులెవరూ రాకపోవడంతో కోరం లేక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. సమావేశానికి ఎంపీపీ మారూరి పద్మావతి తప్ప సభ్యులెవరూ రాలేదు. సభ్యులెవరైనా వస్తారని గంటపాటు వేచిచూశారు. అయినప్పటికీ ఎంపీటీసీలు ఒక్కరూ రాకపోవడంతో సమావేశం వాయిదా వేశారు. సమావేశంలో ఎంపీడీఓ పి.రత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి సభ్యులు ఒక్కరు కూడా రాకపోవడంతో మండలంలోని రాజకీయం ఆసక్తిగా మారింది. ఈనెల 28న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఉండటం.. సభ్యులెవరూ సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇరువర్గాలలో ఎవరైనా క్యాంపు ఏర్పాటుచేసి ఎంపీటీసీలను తరలించారనే అనుమానాలను రాజకీయవర్గాల నుండి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మాచర్లలో పరిశ్రమలు స్థాపించాలి

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్లకు పెట్టుబడులు తెచ్చి పరిశ్రమలు స్థాపించాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాచర్లకు ఉన్న ఫ్యాక్షన్ మచ్చ పోవాలంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. అభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లారెడ్డి, జిల్లా కార్యదర్శులు రాగిడి బాబు, షేక్ బాబు, కిన్నెర అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన కరపత్రాల ఆవిష్కరణ

కారంపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో గురువారం శ్రీవాసవీ ఆర్యవైశ్య 2025 సంవత్సరం కార్తీకమాస వన సమారాధన కమిటి ఆధ్వర్యాన స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరుట్ల దేవస్థానంలో ఈనెల 26వ తేదీన ఆర్యవైశ్యులకు అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయానికి ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక అంకాళమ్మ ఆలయం నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, శ్రీవాసవీ అన్న ప్రసాదం కమిటీ ఫౌండర్ బవిరిశెట్టి రామారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు సముద్రాల సాయి, చలవాది మాధవ్, సూరే సుబ్రహ్మణ్యం, ఆతుకూరి గోపి, చీతిరాల వెంకట కోటేశ్వరరావు, యక్కల శ్రీనివాసరావు, కొత్తా నరసింహారావు, కరాలపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

26న ప్రమాణ స్వీకారోత్సవాలు

బెల్లంకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో ఈనెల 26వ తేదీ ప్రమాణ స్వీకార మహోత్సవాలు నిర్వహించనున్నట్లు టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్, నల్లమేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బెల్లంకొండ మండల టీడీపీ అధ్యక్షునిగా అక్కల వెంకటరామిరెడ్డి, కోళ్ళూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆసుల జగన్, నందిరాజుపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఓర్సు ఆనంద్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆసుల జగన్ ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం బెల్లంకొండ మండల టీడీపీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్‌ను బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో ప్రమాణస్వీకార కార్యక్రమకాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు హాజరవుతారని మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, సర్పంచ్ జ్యోతిసముద్రం, సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, భూక్యా శ్రీనునాయక్, శ్రీరామమూర్తి, ఎన్ పిచ్చయ్య, సుభానీ, కందుల వెంకటేష్, రజాక్, ఇబ్రహీం, అహమ్మద్, సలాం తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 44.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 21,500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, ఒక గేటు ద్వారా 20,855, మొత్తం 37,855 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

సత్రశాలలో ప్రత్యేక పూజలు

రెంటచింతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో రెండో రోజు గురువారం బోడపాటి రామకృష్ణ, కోటేశ్వరి, కోలా శివారెడ్డి శ్రీలక్ష్మీ దంపతులు వేయి మందికి అన్నదానం చేశారు. వివిధ రకాల పూజలతో పాటు హోమం నిర్వహించారు. ఆకాశ దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ జీవీ శివయ్య, బోర్డు మెంబర్లు, ఈవో గాదె రామిరెడ్డి, ప్రభురాజ్‌యాదవ్, లింగయ్య యాదవ్, నీలం మల్లయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు



సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

పవిత్ర కార్తీకమాసంలో భక్తకోటితో సూర్యలంక సముద్రతీరం పులకించి పోతోంది. ఏటా కార్తీక మాసంలో లక్షలాది మంది భక్తులు ఇక్కడికి విచ్చేసి.. తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరిస్తారు. సూర్య నమస్కారాలతో ప్రారంభించి.. ఇసుకతో శివలింగాకృతి చేసి పూజలు చేస్తారు. కార్తీక దీపాలు వెలిగించి సముద్రంలో వదిలిపెడతారు.నిత్యం ఈ కార్యక్రమం కార్తీమాసం అంతా అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది భక్తజనం మరింత పెద్దమొత్తంలో తరలి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. దీనిపై ఇప్పటికే సమీక్షలు జరిపారు. తాత్కాలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు.

కార్తీకం.. వెలుగుల తీరం

● తరలిరానున్న భక్తజనం ● ప్రకృతి ఆహ్లాదం.. వసతుల్లో నిస్తేజం ● పాలకులు ప్రగల్భాలకే పరిమితం



దాతల సహకారంతో నిర్మించిన పోలీసు వాచ్‌టవర్

బాపట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన సముద్ర కెరటాలు, ఇసుక తిమ్మెరలు, కాలుష్యం లేని పడవలు, కన్యాకుమారిని తలపిస్తూ.. సూర్యోదయ దర్శనం, కనుల పండుగగా బాపట్ల సూర్యలంక తీర ప్రాంతం ఉండడంతో.. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తూ ఆంధ్ర గోవాగా ఖ్యాతినార్జించింది. అయితే.. సూర్యలంక సముద్ర తీరంలో నానాటికి వసతులు కొరవడి పర్యాటకులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కార్తీకమాసంలో పుణ్యక్షేత్రంగా భావించి.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తజనం విశేష సంఖ్యలో ఇక్కడకు వస్తారు. పాలకులు, అధికారులు వారికి శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పిస్తామని వాగ్దానాలు చేయడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రిగా ఆర్కే రోజా రెండు సార్లు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అభివృద్ధి విషయంలో ఆమె ఇచ్చిన హామీలు.. నీటి మూటలుగానే మిగిలిపోయాయి. సముద్రంలో ప్రమాదాలను పసిగట్టేందుకు పోలీసు అధికారులు మాత్రం దాతల సహకారంతో మూడు వాచ్ టవర్లు నిర్మించారు. మంతెన దశరథమహారాజు దాతల సహకారంతో తీరంలో శివాలయం నిర్మించారు. ఈ రెండు మినహా ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు పర్యాటకుల సౌకర్యార్థం దుస్తులు మార్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధి పేరిట వాటిని తొలిగించి ఎలాంటి వసతులు కల్పించలేకపోయారు. కూటమి ప్రభుత్వం పర్యాటక కేంద్రం సూర్యలంక అభివృద్ధికి ఈ ఏడాది రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు పూర్తయితే.. తీరం అద్భుతమవుతుంది.

ఆసీలు వసూళ్లతో అధిక ఆదాయం

లక్షలాది మంది భక్తులొచ్చే సూర్యలంక తీరంలో కేవలం నాలుగు స్నానాల గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని వేలం పెట్టి పంచాయతీ ఆదాయం సమకూర్చుకుంటోంది. తీరానికి వచ్చే వాహనాల పార్కింగ్, స్నానాల గదుల ఆసీలు వసూలు ద్వారా గతంలో పంచాయతీకి రూ.36.06 లక్షల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం మూడు నెలలకోసారి వేలం పాట పెట్టి అత్యధిక ఆదాయం రాబడుతున్నారు. అలాగే తీరంలో ఉన్న 38 షాపుల ద్వారా ఏటా రూ.11.40లక్షల ఆదాయం వస్తుంది. ఇంటి పన్ను ఇతర ఆదాయం ఏడాదికి కోటి రూపాయల వరకు ఈ పంచాయతీకి వస్తోంది. గజ ఈతగాళ్లు, పారిశుధ్య కార్మికులకు ఇందులో నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. శానిటేషన్ సామగ్రి, లైట్లు ఇతర అవసరాలకు కూడా ఈ డబ్బులే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదాయం రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం కాస్తా ఇతరత్రా అవసరాలకు వినియోగించి భక్తులకు వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



సూర్యలంక తీరంలో దాతలు నిర్మించిన శివాలయం

అంతిమ యాత్రకు దారి లేక..

బాపట్ల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని 23వ వార్డు ఆనంద నగర్ కాలనీ శ్మశానానికి దారిలేక దశాబ్దాలుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. శవపేటికలను పొలాల నుంచి తాడిచెట్ల మధ్య నుంచి మోసుకుంటూ శ్మశానికి తీసుకెళ్తున్నారు. కాలనీ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికి శ్మశానం సూర్యలంక రోడ్డులో ఉంది. భూమి మండల పరిధిలోకి వస్తుందని చెప్పి మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. మండలాధికారులు దారికి భూమి కొనుగోలు చేయాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు రైతులకు చెల్లించాల్సి వస్తుందనే సాకుతో పట్టించుకోకుండా వదిలేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి శ్మశానానికి దారి చూపించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



శవపేటికను వరిపొలం నుంచి తీసుకెళ్తున్న కాలనీవాసులు

ప్రత్యేక రక్షణదళం సేవలు అమూల్యమైనవి

● ఘనంగా ఏపీ ఎస్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి కుమార్ విశ్వజిత్

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం సేవలు అమూల్యమైనవని (ఏపీ ఎస్పీఎఫ్) ఏపీ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ పేర్కొన్నారు. ఏఎన్‌యూలో గురువారం ప్రత్యేక రక్షణ దళం ఆవిర్భావ దినోత్సవాలు డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమవర్మ, ఇన్‌స్పెక్టర్ నరల్ బి.వి.రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ విచ్చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ఎస్‌పీఎఫ్ నియామకాలు, 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న పోలీసులకు పదోన్నతులు ప్రభుత్వ పరిశీలనలో పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ హోమ్ సెక్రటరీ విజయ కుమార్, ఏఎన్యూ రెక్టార్ శివరాంప్రసాద్, కమాండెంట్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కరి మబ్బు కమ్మెను..!



అల్పపీడన ద్రోణితో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వాతావ'రణంలో' వచ్చిన మార్పులతో.. కరి మబ్బులు వినుకొండ పట్టణాన్ని కమ్మేశాయి. పట్టణంలోని మున్సిపల్ సెంటరులో గురువారం ఉదయం 11 గంటలకు ఆకాశంలో ఆవిష్కృతమైన దృశ్యం పట్టణ వాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. నల్లటి మేఘాలు మీద పడుతున్నట్లుగా.. ఒక్కచోటికి చేరాయి.

-వినుకొండటౌన్, ఆంధ్రజ్యోతి

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

బిలియర్డ్స్ పోటీల ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు



పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, క్లబ్ కార్యదర్శి దుర్గారావు, అధ్యక్షుడు బ్రహ్మేశ్వర రావు, వెంకటేశ్వరరావు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఇస్తున్న సదుపాయాలను వినియోగించుకొని అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి కృషి చేయాలని శాప్ చైర్మన్ ఎ. రవినాయుడు పేర్కొన్నారు. గురువారం ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిలియర్డ్స్ అండ్ స్నూకర్ కాంప్లెక్స్‌లో ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద అనేక మంది క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్‌లో కూడా ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ ఇన్సెంటివ్ పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పీ4 విధానంలో క్రీడాకారులనూ దత్తత తీసుకుని, కొన్ని క్రీడలను స్పాన్సర్ చేసి పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. క్లబ్‌లో ఇలాంటి క్రీడా సౌకర్యాలు కల్పించిన యాజమాన్యాన్ని అభినందించారు. పోటీల నిర్వహణ కార్య దర్శి పులివర్తి వెంకటేశ్వరావు (అజార్) మాట్లాడుతూ ఈ పోటీలు నవంబరు 3 వరకు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని, జనవరిలో హరియాణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్లబ్ కార్యదర్శి యాగంటి దుర్గారావు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలకు ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ వేదిక అవుతుందన్నారు. అధ్యక్షుడు షైనేని బ్రహ్మేశ్వరరావు ఉపాధ్యక్షుడు వణు కూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షం..

● వర్షాలకు పంటలు నష్టం
● సస్య రక్షణ చర్యలు సూచిస్తున్న అధికారులు

తక్షణ రక్షణే కర్తవ్యం



పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు

నరసరావుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో అధిక వర్షాలు జిల్లా అంతటా కురుస్తున్నాయి. వానలు పంటలకు నష్టాన్ని కలిగిస్తున్నా యి. వర్షాల వలన కలిగే నష్టాలను నివారించుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు సూచనలు చేశారు. ఆ యన గురువారం పంట పొలా లను పరిశీలించి వర్షాలు కురు స్తున్న సమయంలో వరి, పత్తి, కంది, మొక్క జొన్న పంటల్లో తీసుకొవాల్సిన ముందస్తు జాగ్రత్తలను రైతులకు తెలిపారు. రైతులు ఈ కింది జాగ్రత్తలు పాటించి పంట నష్టాన్ని నివారించుకొవాలని సూచించారు.

వరిలో జాగ్రత్తలు

వరి పంట దుబ్బు చేసే దశలో ఉంది. పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. కాండం కుళ్లు నివారణకు.. 2. 5 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజెబ్ శిలీంధ్ర నాశక మందును లేదా ఒక మిల్లీ లీటరు వాలిడామైసిన్ కాని లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అగ్గి తెగులు గమనించినట్లయితే 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తే నత్రజని వేసుకోవడం వాయిదా వేసుకోవాలి.

పత్తి పంటలో మేళకువలు

పత్తి పంట ప్రస్తుతం పూత, కాయలు పెరిగే స్థితిలో ఉంది. పొలంలో వీలైనంత త్వరగా మురుగు నీరు పోయే అవకాశం కల్పించాలి. వెంటనే అంతర కృషి చేసి, నేల ఆరేటట్లు చేయాలి. పైపాటుగా ఎకరానికి 25-30 కేజీల యూరియా+10-15 కేజీల పోటాష్ ఎరువులను అందించాలి. మురుగు పోయే అవకాశం లేనప్పుడు నత్రజని, పొటాషియం (2శాతం పొటాషియం నైట్రేట్), లేదా 2 శాతం యూరియా, మెగ్నీషియం (ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్)ను 5 - 7 రోజులు వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు అందించాలి (బలహీన పడ్డ వేరు మండలానికి సాయంగా). వీటి ద్వారా పండాకు తెగులును కూడా సమర్థంగా అదుపులో ఉంచవచ్చు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన అనంతరం ఎకరాకు 25 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ దూరంలో పాదులు తీసి ఎరువులను వేసి మట్టితో కప్పాలి.

మిరప పంట రక్షణ: మిరప పంటలో అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్కకు అవసరమైన పోషకాలను తీసుకోలేదు. పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనపడే అవకాశం ఉంది. పంట దశ ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉంది. జూలైలో వేసిన మిరప పంట ప్రస్తుతం పూత నుంచి కాయ ఏర్పడే దశలోను నారు పెంచి ఆగస్టు, సెప్టెంబర్ నెలలో నాట్లు వేసిన మిరప పొలాలు శాఖీయా దశలో ఉంది. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించే ఏర్పాటు చేయాలి. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి.

సంక్లిష్టంగా పత్తి కొనుగోలు!

గతేడాది సీఎం యాప్‌లోనే ప్రక్రియ మొత్తం నిక్షిప్తం

● కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌తో కొరవడిన అవగాహన ● యాప్‌లో సమస్య తలెత్తితే..పరిష్కారం ప్రశ్నార్థకం



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా ఈ నెలాఖరులోపే ప్రత్తి కొనుగోళ్ల ప్రారంభం కానుండగా.. ఇప్పటి వరకు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందికి నూతన విధానంపై అవగాహన కొరవడింది. కొనుగోళ్ల ప్రక్రియని సులభతరం చేయాల్సిన సీసీఐ అందుకు భిన్నంగా సంక్లిష్టం చేసింది. గత సీజన్ వరకు సీఎం యాప్‌తోనే ప్రక్రియ మొత్తం పూర్తి అయిపోయేది. ఈ సంవత్సరం ఎందుకనో కపాస్ కిసాన్ యాప్ అంటూ ఒక దానిని తీసుకొచ్చింది. దీని వినియోగంపై కింది స్థాయి సిబ్బందికి సరైన అవగాహన లేదు. ఈ యాప్‌ని వినియోగించేందుకు ఎవరికి ప్రత్యేకించి లాగిన్ సదుపాయం లేదు. ఎవరైనా ఉపయోగించొచ్చు. అయితే రైతులకు స్పష్టమైన అవగాహన ఉండదు కాబట్టి కొనుగోళ్ల సందర్భంగా ఈ యాప్ వలన సమస్యలు తలెత్తకుండా ఎవరు చూస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గిట్టుబాటు కానీ బహిరంగ మార్కెట్ ధర

ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 90,872, గుంటూరులో 23,934, బాపట్లలో 1834 హెక్టార్లలో రైతులు పత్తి పంట వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదించారు. అత్యధికంగా పల్నాడు జిల్లా నుంచి 1,35,235 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. గుంటూరులో 34,124 ఎంటీలు, బాపట్లలో 1962 ఎంటీల దిగుబడి రావొచ్చని భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనందున రైతులు తప్పక సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

సంక్లిష్టంగా విక్రయ ప్రక్రియ

రైతు తన పంటని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. తొలుత రైతు సేవా కేంద్రానికి వెళ్లి అక్కడ గ్రామీణ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలి. తన ఆధార్, మొబైల్ నంబరు ద్వారా సీఎం యాప్‌లో రిజిస్టర్ చేయించాలి. ఆ యాప్‌లో రైతుకు సంబంధించిన అన్ని వివరాలు వస్తాయి. దానిని ఈ-క్రాప్ డేటాతో క్రాస్ చెక్ చేస్తారు. అప్పుడే కపాస్ కిసాన్ యాప్‌ని వినియోగించి మొబైల్ నంబరు, ఎస్ఎంఎస్ ధ్రువీకరణ ద్వారా షెడ్యూలింగ్ చేస్తారు. షె డ్యూల్ ప్రకారం రైతు తన వద్ద ఉన్న పంట దిగుబడిని తీసుకొని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి వెళ్లాలి. మొదటి కోత అయితే 40 శాతం వరకు విక్రయించడానికి అవకాశం ఉంది. రెండో కోత సమయంలో 60 శాతం, మూడో కోత సమయంలో 100 శాతం అమ్ముకోవచ్చు. రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చిన తర్వాత అక్కడ ఉండే మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మళ్లీ సీఎం యాప్‌లో లాట్ నంబరుని జనరేట్ చేస్తారు. ఆ లాట్‌లో ఎంత పత్తి ఉందో కూడా నమోదు చేస్తారు. అప్పుడే గేట్ పాస్‌ని ప్రాసెసింగ్ చేస్తారు. అనంతరం సీసీఐ బయ్యర్ పత్తి రకం, క్వాలిటీ గణాంకాలను నమోదు చేస్తారు. క్వాలిటీ గణాంకాలను బట్టి ఆటోమేటిక్‌గా యాప్‌లోనే రైతుకు ఎంత ధర చెల్లిస్తారో నిర్ధారణ జరుగుతుంది. రైతుకు ఆ ధరని చూపించిన తర్వాత ఆయన ఆమోదంతోనే బిడ్డింగ్ స్లిప్‌ని జనరేట్ చేస్తారు. అప్పుడు కాటాలు వేసి ఎంత ధర అయితే ఆ తూకానికి చెల్లిస్తారో చెబుతారు. రైతు ఆమోదంతో ఫొటో, వేలిముద్ర సేకరించి తూకం, ధరని లాక్ చేస్తారు. దీని తర్వాత సీపీవో, ఏఎంసీ సూపర్‌వైజర్ వేలిముద్రలు వేయాలి. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ఏఎంసీ సెక్రెటరీ అన్ని వివరాలను చెక్ చేసి తక్‌పట్టిని ఆమోదిస్తారు. అనంతరం తక్‌పట్టి స్లీప్ జనరేట్ చేసి తుది వివరాలను సీపీవోకు పంపుతారు. ఆయన వాటిని సీసీఐకి పంపించి నగదు చెల్లింపు ప్రక్రియకు సిఫార్సు చేస్తారు. చివరగా ఆధార్ లింకు అయి ఉన్న బ్యాంకు అకౌంట్‌కి మాత్రమే నగదుని జమ చేస్తారు.

ఏ చిన్న సమస్య వచ్చినా..మళ్లీ మొదటికి

ఈ ప్రక్రియలో ఏ చిన్న సమస్య వచ్చినా కొనుగోళ్లు నిలిచిపోతాయి. నెట్‌వర్కు సరిగా లేకపోయినా, సాంకేతిక సమస్యలు తలెత్తినా రైతుకు ఇబ్బందులే. రైతు షెడ్యూలింగ్ చేసిన రోజున వాహనం మరమ్మతులకు గురి కావడం, కూలీలు రాకపోవడం, వర్షం వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఆ రోజు స్లాట్‌ని రద్దు చేస్తారు. మళ్లీ స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సిందే. సెక్రెటరీలలోనే చాలామందికి ఈ విధానంపై స్పష్టత కొరవడింది. మార్కెటింగ్ శాఖ నియమించిన టెక్నికల్ సిబ్బంది కూడా సరిగా అవగాహన కల్పించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వారం వ్యవధిలో ప్రారంభం కానున్న పత్తి కొనుగోళ్ల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తుతాయోనన్న భయం అందరిలో నెలకొంది.

హోంగార్డులకు అండగా ఉంటాం: ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజారక్షణకు పాటు పడే హోంగార్డ్‌లకు అండగా ఉంటామని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన హోంగార్డు టీవీకే బాబ్జీ డెప్యుటేషన్‌పై వైజాగ్‌లో విధులు నిర్వహించి ఈ ఏడాది జూన్ 5న ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా బాబ్జీకి గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. హోంగార్డ్ సమస్యలను, కనీస అవసరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషిచేస్తున్న హోంగార్డు ఆర్ఐ కృష్ణను అభినందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

25 గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

శావల్యాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని చిన్న, సన్నకారు రైతులు 25మంది గోకులం షెడ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా వాటిని ప్రభుత్వ అనుమతి కోసం పంపించినట్లు ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజు గురువారం తెలిపారు. ఏపీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని, ఒక్కో గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2లక్షలు కేటాయించి రైతులను పాడిపరిశ్రమవైపు మొగ్గుచూపేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఒక్కో గోకులంషెడ్‌ను 10మీటర్ల వెడల్పు, 30మీటర్ల పొడవుతో నిర్మించడం జరుగుతుందని, రైతులు ఆరు గేదెలు కట్టేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే గోకులం షెడ్ల నిర్మాణాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన శ్రామికుల ఈకేవైసీ ప్రక్రియ 63శాతం వరకు పూర్తయిందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో మొత్తం 15,379మంది శ్రామికులు ఉండగా వారిలో 9664మందికి ఈకేవైసీని పూర్తి చేయడం జరిగిందన్నారు. నెలాఖరులోపు నూరుశాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

నోట్ పుస్తకాలు, భోజన ప్లేట్ల వితరణ

రొంపిచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో టెల్నా సహకారంతో మండలంలోని వివిధ పాఠశాలలకు రూ.2.62 విలువ చేసే నోట్ పుస్తకాలు, రూ.3.25లక్షలు విలువ చేసే భోజనం స్టీలుప్లేట్లు, రూ.64,500 విలువచేసే జామెట్రీ బాక్సులను గురువారం పంపిణీ చేశారు. టెల్నా ప్రతినిధి కరిముల్లా సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం సుభానీ పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కమిటీ ఎన్నిక

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి చిలకలూరిపేట పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఇంటూరి కోటి రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా అద్దేపల్లి బాలసుబ్రమణ్యం ఎన్నికయ్యారు. వీరితో పాటు కమిటీ సభ్యులు గురువారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో పదవీ స్వీకారం చేశారు. దేవాలయాల రక్షణ, గో సంరక్షణ, ధర్మరక్షణ, సనాతన ధర్మాన్ని కాపాడుతామని కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సమితి రాష్ట్ర, జిల్లా శాఖల నాయకులు పిల్లాడి రుద్రయ్య, రాష్ట్ర పొత్తూరి రంగరాజు, మువ్వల మనోజ్, వరికూటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పలువురు పట్టణ ప్రముఖులు కార్యక్రమానికి హాజరై నూతన కమిటీని అభినందించారు.

ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ బిల్లులను విడుదల చేయాలి

● కాసా రాంబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ బిల్లులను రూ.27వందల కోట్లు వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయకపోవటం వల్ల గత పది రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిపివేశారన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి వెంటనే చొరవ తీసుకొని బకాయిలను వెంటనే విడుదల చేయాలని, శస్త్రచికిత్స సేవలను పునరుద్ధరించాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్ఎస్‌పీ ఈఈగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకారం

నూజెండ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దర్శి డివిజన్ నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఈఈగా (ఎఫ్ఏసీ) యూ విజయలక్ష్మి గురువారం దర్శి డివిజన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ప్రధాన ఎన్ఎస్‌పీ కాలువ అయిన పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని జమ్మలమడక, మోదేపల్లి, త్రిపురాపురం మేజర్ల నీటి సరఫరా నిర్వాహణను దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయ పరిధిలో విజయలక్ష్మి పర్యవేక్షించనున్నారు. గతంలో మండలంలో ఎన్ఎస్‌పీ ఏఈగా విజయలక్ష్మి బాధ్యతలు నిర్వహించారు.

26న వాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం ఎన్నికలు

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధార్మిక సంస్థ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం ఎన్నికలు ఈ నెల 26వ తేదీ జరగనున్నాయి. ఆదివారం ఉదయం 11నుంచి 1 గంట వరకు ఓగేరు వాగు పక్కనే ఉన్న గోశాలలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 239 మంది సభ్యులున్నారు. అధ్యక్ష కార్యదర్శుల పదవులకు నాలుగేసి నామినేషన్లు దాఖలయ్యాయి.



ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో రైతులు ఉద్యాన పంటలను సాగుచేసే విధంగా అధికారులు ప్రోత్సహించాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచించారు. గురువారం వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో ఉద్యాన శాఖ అధికారులతో చీఫ్ విప్ జీవీ సమీక్ష నిర్వహించారు. అధిక ఆదాయం ఇచ్చే పంటలైన పండ్లు కూరగాయలు సుగంధ ద్రవ్యాలు వంటి పంటలను రైతులు సాగు చేసేలా అధికారులు అవగాహన కలిగించి ప్రోత్సహించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటలకు, పరికరాలకు అందిస్తున్న రాయితీలు అంటే పథకాలను రైతులకు వివరించాలని కోరారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రాయితీ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు రైతులు ఆర్జించవచ్చని తెలిపారు. వినుకొండను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దటమే తమ ధ్యేయమని, అధికారులు సహకరించి రైతుల్లో అవగాహన పెంపొందించాలని వివరించారు. వినుకొండ నియోజకవర్గంలో ఈ సీజన్ పూర్తయ్యే నాటికి 17వేల ఎకరాలలో ఉద్యానవన పంటలు కొత్తగా వేయించాలని ఉద్యాన, అనుబంధ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రూ.4కోట్లు మంజూరైనట్టు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తెలిపారు. ఇందులో డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్ రూ.2కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో పట్టణాభివృద్ధిపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో ఐటీసీ భాగస్వామ్యంతో రోడ్ల విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ, వాణిజ్య సముదాయాల నిర్మాణం చేపట్టాలని కోరారు. కృష్ణ మహల్ సెంటర్ నుంచి ఏ.ఎం.జీ చెక్ పోస్టు వరకు మధ్యలో డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ పనులు, ఆక్రమణల తొలగింపు కారణంగా పట్టణ పరిధిలో దుకాణాలు కోల్పోయిన వారికి వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టాలని ఐటీసీ ప్రతినిధులకు ప్రత్తిపాటి సూచించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద నుంచి నరసరావుపేట రోడ్డువరకు ఉన్న బైపాస్ విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని, వీరముష్టి కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని, శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీమ్, ఐటీసీ అధికారి దీక్షితులు, టీపీఎస్ వెంకటేశ్వరావు, ఇంచార్జి సర్వేయర్ రాజేష్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు



క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ముగిసిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు

యడ్లపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు, జట్ల ఎంపిక మండలంలోని సొలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. అండర్-17 విభాగంలో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహించి డివిజన్ జట్లను ఎంపిక చేశారు. వర్షం కారణంగా అండర్-14 జట్ల ఎంపికను వాయిదా వేశారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై పోటీలను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను అతిథులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్, లింగారావుపాలెం హైస్కూల్ విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీలలో నరసరావుపేట డివిజన్‌లోని నూజెండ్ల, ఈపూరు, వినుకొండ, రొంపిచర్ల, శ్యావల్యాపురం, నరసరావుపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు చెందిన 400మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర, బాలికల విభాగాలలో యడ్లపాడు మండల జట్లు ఓవరాల్ విజేతలుగా నిలిచాయి. కాగా పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో డివిజన్ జట్లను ఎంపికచేశారు. ఎంపికైన వారు ఈ నెల 25న వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించే జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని పల్నాడు జిల్లా స్కూల్ ఫెడరేషన్ కార్యదర్శులు వి.పద్మావతి, నాగభైరు సురేష్‌లు తెలిపారు.

బాలుర జట్టు వివరాలు: ఎస్‌కే రసూల్, బి.సుమంత్, లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ (యడ్లపాడు), ఎ.శివరామకోటేశ్వరరావు, వి మోహన్‌రెడ్డి, డి.శ్రీనివాస్, షేక్ షహీమ్, గుడ్ షెపర్డ్ హైస్కూల్, వినుకొండ, డి.జాన్ వెస్లీ, జడ్పీ హైస్కూల్, కారుచోల (యడ్లపాడు), కె.స్టీఫెన్, జడ్పీ హైస్కూల్, ఉన్నవ (యడ్లపాడు), ఎ.బాలనందీశ్వరరెడ్డి, గీతమ్స్, వినుకొండ, బి.జశ్వంత్ లయోలా, వినుకొండ, కె.షారోన్‌రాజ్, జడ్పీ హైస్కూల్, సంతగుడిపాడు, షేక్ రియాజ్, జడ్పీ హైస్కూల్, విప్పర్లరెడ్డిపాలెం.

బాలికల జట్టు: వి.ఐశ్వర్య, జడ్పీ హైస్కూల్, టి.పూజిత, బి.నాగప్రియాంక, జె.మేరీసునీత, సొలస (యడ్లపాడు), ఎల్.అక్షిత, కె.ప్రశాంతి, కారుచోల (యడ్లపాడు), ఎం.త్రిష, విద్యా వికాస్, వినుకొండ, షేక్ షాహనాజ్, ఎస్‌బీఆర్, నరసరావుపేట, కె.రాణి, గుడ్ షెపర్డ్, వినుకొండ, ఎన్.బిందు, జడ్పీ హైస్కూల్, జొన్నలగడ్డ, ఎన్ లావణ్య (నరసరావుపేట రూరల్), సీహెచ్ వైష్ణవి, జెడ్పీహెచ్ఎస్, నూజెండ్ల.



అండర్-17 బాలుర, బాలికల జట్లతో సెలక్టర్లు, ఉపాధ్యాయులు



దేవాలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో భగినీ హస్త భోజనం

వినుకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండమెట్లవద్ద ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో కార్తీకమాసంను పురస్కరించుకుని జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా మహిళా భక్తులకు దేవస్థానం తరపున అమ్మవారి పసుపు, కుంకుమలు ప్రసాదంగా అందజేశారు. అనంతరం అన్నా చెల్లెళ్లకు భగినీ హస్త భోజనాన్ని సామూహికంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనసేన మహిళా నాయకురాలు ఉషా పాల్గొని మాట్లాడుతూ ఈ సంప్రదాయం సనాతన ధర్మాన్ని హిందూ సంప్రదాయ విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రతిరోజు దేవస్థానంలో తెల్లవారుజామున బ్రహ్మ మూహూర్తంలో స్ఫటిక శివలింగానికి అభిషేకాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అలయ మహిళా సేవకులు ఏటుకూరి కృష్ణవేణి, విడతల రమ, పత్తి భ్రమరాంబ, తిరువాయిపాటి సరోజినమ్మ, గంగిశెట్టి నాగలక్ష్మి, కాకుమాను రామారావు, బద్దిక నరసింహారావు, హనుమంత సూరి, సామి మాస్టర్, టైల్స్ సురేష్ కుమార్, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



యడ్లపాడులోని ప్రత్యేక ఆధార్ కేంద్రంలో విద్యార్థి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో హేమలతాదేవి

యడ్లపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుల అప్‌డేషన్, నూతన ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేని 0-6 సంవత్సరాల లోపు పిల్లలకు నూతన ఆధార్ కార్డులు జారీచేయడం, పాఠశాలల్లో చదువుతున్న 6-15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పిల్లల బయోమెట్రిక్ అప్‌డేషన్ ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాల ద్వారా చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లల ఆధార్ కార్డుల అప్‌డేషన్, కొత్త కార్డుల రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్‌లు షేక్ రఫీ, డి.సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

నూజెండ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వీవోఏలకు గురువారం అసిస్ట్ ఐటీసీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించాలని, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛ రథాలను ఉపయోగించుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఏపీవో ఆంజనేయరాజు, ఏపీఎం ఇందిర తదితరులు పాల్గొన్నారు.



క్రీడా దుస్తులతో కంభంపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

నూజెండ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులకు త్రిపురాపురం డీసీ, గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రోత్సహించటం ద్వారా వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ప్రతిభా పాటవాలను చూపిస్తారని ప్రధానోపాధ్యాయుడు ఎంతఈ నాగబసవయ్య అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎండ్లూరి సుబ్బారావు, వెన్ను పెద వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి పెదముత్తయ్య, మేదరమెట్ల హనుమంతరావు, ఎండ్లూరి వెంకటేశ్వర్లు, గుత్తా గోవిందయ్య, గంగినేని వీరయ్య, ఎండ్లూరి శ్రీనివాసరావు, పేరం వెంకట అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ఏ సోమ సూర్యప్రకాశరావు, పీ శ్రీనివాసరావు, ఎల్ అంజిరెడ్డి, ఎల్.రామాంజిరెడ్డి, జీ చినగోవిందు, ఏబీఎన్ శేఖర్, ఏ సురేష్, పీడీ ఏ బాలు తదితరులు పాల్గొన్నారు.

రేపు శివ నాగేంద్ర స్వామి దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని శివ నాగేంద్రస్వామి దేవాలయ 40వ మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. నాగుల చవితిని పురస్కరించుకొని ఉదయం వార్లుపోసే కార్యక్రమం, గీతా సమాజం వారిచే లలితా పారాయణం, మధ్యాహ్నం మహా నైవేద్య నివేదన, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని వివరించారు. సాయంత్రం స్వామివారి జెండాను గ్రామంలో ఊరేగిస్తామని వివరించారు. ఈ సందర్భంగా మహిళలతో కోలాటం, సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయి.

ప్రతిభ చూపిన సెయింట్ చార్లెస్ స్కూల్ విద్యార్థులు

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ చార్లెస్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు తమిళనాడులోని వెల్లూరు జిల్లా అమ్మూరులో జరిగిన సైన్స్ ఎనలిటిక్ పోటీలలో ప్రతిభ చూపారు. జూనియర్స్ విభాగంలో 4వ తరగతి విద్యార్థి మాదాసు వైశాలి ప్రథమ, సూపర్ జూనియర్స్ విభాగంలో షేక్ అంజుమ్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, స్టేట్ బోర్డ్‌కు చెందిన జూనియర్స్ విభాగంలో 4వ తరగతి విద్యార్థి మిధునశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు.

ఏకగ్రీవంగా టీడీపీ అనుబంధ కమిటీల ఎన్నికలు

చిలకలూరిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ ఎస్సీ సెల్, కల్చరల్ సెల్ కార్యవర్గాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుల్లి చిన్నబాబు, ప్రధాన కార్యదర్శిగా జుంజి చిన్ని, ఉపాధ్యక్షుడిగా ఎడ్లూరి రంగ, మూకిరి వీరేష్, కల్చరల్ సెల్ అధ్యక్షుడిగా గారపాటి రాజకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎ.పల్లవి, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, భూక్యా లాలూనాయక్‌లు ఎన్నికయ్యారు.

ఆరోగ్య కేంద్రాల్లో నిత్యం వైద్యసేవలందాలి

● కలెక్టర్ కృతికా శుక్లా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావు పేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటలూ వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. షిఫ్టుల వారీగా విధులు కేటాయించి స్టాఫ్ నర్సులు అన్నివేళలా డ్యూటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య సేవలు మెరుగుపరిచేందుకు మండలాల వారీగా మెంటార్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాలు, హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేసేందుకు నిర్మాణ సమస్యలు పరిష్కరించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు, కొరత ఉన్న ఇతర సిబ్బంది నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. చెంచులకు ఆరోగ్యశ్రీ, జన ఆరోగ్య యోజన కార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, డీసీహెచ్ఎస్ ప్రసూన, పంచాయతీ రాజ్ ఎస్ఈ కె.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఫార్మసీ కోర్సుల ప్రారంభం

● తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే అరవిందబాబు



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పక్కన కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా.

నరసరావుపేట టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఫార్మసీ కోర్సులు ప్రారంభమయ్యాయి. గురువారం నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ఫార్మసీ విద్యారంగంలో నరసరావుపేట ప్రాంతం కొత్త మైలురాయిని చేరుకుందన్నారు. ఫార్మసీ తరగతులతో ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను మరింత చేరువవుతాయన్నారు. కళాశాల అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడంలో కళాశాల ముందుంటుందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ ఫార్మసీ కోర్సుల ప్రవేశంతో విద్యార్థులకు కొత్త అవకాశాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, కూటమి నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

రొంపిచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు గురువారం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రెడ్డిపాలెం, మాచవరం, పరగటిచర్ల, అన్నవరం, ముత్తనపల్లి తదితర గ్రామాల్లో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మాచవరంలో చప్టా పైనుంచి వర్షపునీరు ప్రవహించటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, అన్నవరం గ్రామాల్లో వర్షపునీరు చప్టాలను తాకుతూ ప్రవహిస్తోంది. ఇదేవిధంగా వర్షాలు కురిస్తే మిగిలిన చోట్ల కూడా బ్రిడ్జిల పైనుంచి వర్షపు నీరు ప్రవహించే అవకాశం ఉంది. మాచవరంలో వర్షం కురిసినప్పుడు నీరు మురుగు కాలువల్లో అధికంగా ప్రవహించటం వల్ల రహదారిపైకి వస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టాలని కోరుతున్నారు.

28న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై కూటమి ప్రభుత్వ వైఖరిపై ఈ నెల 28న నిరసన చేపట్టనున్నట్లు పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 28వ తేదీన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న కార్యక్రమం గోడపత్రికను గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు పాల్గొన్నారు.



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

కోటి సంతకాల సేకరణలో

ప్రజలందరూ భాగస్వాములు కావాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్‌కు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్య కోసం రూ.5వేల కోట్లు వెచ్చించటం లేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు జారీచేసిన జీవోను ఉప సంహరించు కోవాలన్నారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్వాహణ చేపట్టాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల చొప్పున 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకురావటం జరిగిందన్నారు. ఒక్కొక్క కళాశాలకు 50ఎకరాల చొప్పున భూమిని కేటాయించి రూ.8,500 కోట్లతో మెడికల్ కళాశాలల నిర్మాణానికి పూనుకున్నారన్నారు. ఐదు కళాశాలలు నిర్మాణం పూర్తయి తరగతులు కూడా ప్రారంభించటం జరిగిందన్నారు. మరో ఐదు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ముఖ్యమంత్రి మెడికల్ కళాశాలలను తన అనుచరులకు కట్టబెట్టే కుట్రలో భాగంగా పీపీపీ అనే విధానాన్ని తీసుకువచ్చారన్నారు. కళాశాలలను పూర్తిచేసి విద్యార్థులకు విద్యను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.